క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా


అబ్దుల్ హమీద్

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన అబ్దుల్ హమీద్ తెలిపారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బొబ్బిలి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, జిల్లా పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు సిఫార్సులతో తనకు ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలని అన్నారు. ఆయన తనపై ఉంచిన నమ్మకాన్నివమ్ము చేయకుండా పార్టీలో మైనార్టీ విభాగాన్ని పటిష్ట పరచేందుకు మాజీ ఎమ్మెల్యే శంబంగి, జిల్లా పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు సూచనలను పాటిస్తానన్నారు. హమీద్ ఇంతకు ముందు వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు.

ముగిసిన హిందీ వారోత్సవాలు


మాట్లాడుతున్న మధుసూదనరావు

రాజాం: దేశసమైక్యతకు హిందీ భాష వారధని రాజాం హిందీ ప్రచారక్ కె.మధుసూదనరావు అన్నారు. ఆదివారం హిందీదివస్ వారోత్సవాల ముగింపు కార్యక్రమం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీభాష నేర్చుకుంటే ఎన్నో లాభాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పోలాకి ఈశ్వరరావు, శ్రీనివాసరావు, గోవిందరావు, హిందీభాషోపాధ్యాయులు రమేష్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత


మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ సీఐ జైభీమ్, తదితరులు

రాజాం: మొక్కలు నాటడం సామాజిక బాధ్యత అని, ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని రాజాం ఎక్సైజ్ శాఖ సీఐ ఆర్.జైభీమ్ సూచించారు. మండలంలోని పొగిరి జిల్లా పరిషత్ ఆవరణలో ఎక్సైజ్ పోలీస్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఆమొక్కల సంరక్షణ బాధ్యతను గ్రామానికి చెందిన యువతకు అప్పగించారు. హెచ్‌ఎం పద్మావతి, ఎక్సైజ్ ఎస్‌ఐలు మాన్యాలు, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి వీణ కళాకారుడికి కీర్తి చక్ర అవార్డు


గంగాధరాచారిని సత్కరిస్తున్న నిర్వాహకులు

బొబ్బిలి: ఖండాంతర ఖ్యాతి పొందిన బొబ్బిలి వీణల తయారీదారుల్లో ఒకరైన ఎస్.గంగాధరాచారికి హైదరాబాద్‌కు చెందిన శ్రీ ఆర్యాణి ఫౌండేషన్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా జాతీయ స్థాయి కీర్తి చక్ర అవార్డు ప్రదానం చేసింది.హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో శ్రీ గౌతమేశ్వర సాహితీ కళాసేవా సంస్థ సౌజన్యంతో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు గంగాధరాచారిని స్వర్ణమకర కంకణంతో సత్కరించి, అవార్డును, మెమొంటోను అందజేశారు. తనకు అవార్డు అందజేసిన నిర్వాహకులకు గంగాధరాచారి కృతజ్ఞతలు తెలిపారు.

సేవాభావం అలవర్చుకోవాలి


దేవుదల గీతాశ్రమంలో మాట్లాడుతున్న ఎస్.వి.రమణ

రేగిడి: ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్.వి.రమణ అన్నారు. మండల పరిధిలోని దేవుదల గ్రామంలోని గీతాశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు గొర్లె దామోదరరావు ఆధ్వర్యంలో ఆదివారం సత్సంగ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.వి.రమణ మాట్లాడుతూ మనిషిలో భక్తిభావాన్ని పెంపొందించేలా ఆలోచనలు ఉన్ననాడే ప్రతీ ఇల్లు, ప్రతీ గ్రామం ఆధ్యాత్మిక మందిరంగా మారుతుందన్నారు. సత్సంగాలతో ప్రశాంతత, ఆనందం లభిస్తుందని అన్నారు. అనంతరం భగవద్గీత పారాయణం చేశారు. ఆధ్యాత్మిక వక్తలు ఏ.కామేశ్వరరావు, బి.సత్యనారాయణ, కె.మోహన్‌దాస్, నిత్యస్మరణానంద స్వామి పాల్గొన్నారు.

పశువైద్యం.. దైన్యం


వంగర పశువైద్య కేంద్రం

- వంగర మండలంలో పశువైద్య సేవలపై నిర్లక్ష్యం
- వంగర, రాజులగుమ్మడలో పశువైద్యశాలలు
- రెండు వైద్యశాలల్లోనూ వైద్యాధికారులు లేరు
- రెండు ఆస్పత్రులకు ఒకరే ఎల్‌ఎస్‌ఏ
- మరో వైపు సిబ్బంది, మందుల కొరత
- రైతు సేవా కేంద్రాల్లోనూ అదే పరిస్థితి
- అవస్థలు పడుతున్న పాడిరైతులు


రాజులగుమ్మడ పశువైద్య శాల

వంగర: మండలంలో పశువులు, మూగజీవాలకు ప్రభుత్వ వైద్యశాలలు, రైతు సేవా కేంద్రాల ద్వారా సకాలంలో, మెరుగైన వైద్యసేవలు అందకపోతుండడంతో మృత్యు వాతపడుతున్నాయి. పాడిరైతులు అవస్థలను పాలకులు పట్టించుకోవడం లేదు. పశువైద్యసిబ్బంది కొరత పాడిరైతులకు శాపంగా మారింది. మండల కేంద్రం వంగరలో, రాజులగుమ్మడ గ్రామంలో పశువైద్య కేంద్రాలున్నాయి. ఈ రెండు వైద్య శాలల్లోనూ వైద్యాధికారులు లేరు. ఒక్కో వైద్యశాలలో ముగ్గురు చొప్పున సిబ్బంది ఉండాలి. కానీ వంగరలో అటెండర్, రాజులగుమ్మడలో లైవ్ స్టాక్ అసిస్టెంట్(ఎల్‌ఎస్‌ఏ) మాత్రమే ఉన్నారు. ఈ వైద్యశాలల్లో పనిచేసిన వైద్యాధికారులు రెండున్నరేళ్ల క్రితం బదిలీపై వెళ్లిపోగా అప్పటి నుంచి శాశ్వత వైద్యాధికారులను నియమించలేదు. వంగర పశువైద్య కేంద్రానికి సంతకవిటి మండలం జి.ఎస్.పురం వైద్యుడు కొన్నాళ్లు ఇన్‌చార్జిగా కొనసాగారు. మండల కేంద్రానికి 35 కిలోమీటర్ల దూరం ఉండడంతో ఆయనకు రెండు చోట్లా పని చేయడం కష్టతరంగా మారింది. రెండేళ్ల క్రితం ఓ వైద్యాధికారిణిని వంగరకు నియమించారు. ఆమె ఒక్క రోజు విధులు నిర్వ ర్తించి మరుసటి రోజే వేరే ఆస్పత్రికి డిప్యూటేషన్‌పై వెళ్లి పోయారు. రెండు నెలల క్రితం వెంకటరావు అనే వైద్యుడు వంగరలో విధుల్లో చేరి ఆ మరుసటి రోజునే జి.సిగడాం మండలం టి.డి.వలసకు డిప్యూటేషన్‌పై వెళ్లిపోయారు. రాజులగుమ్మడ పశువైద్య కేంద్రానికి పూర్తిగా వైద్యుడిని నియమించడమే మరచిపోయారు. ఇక్కడ లైవ్ స్టాక్ అసిస్టెంట్(ఎల్‌ఎస్‌ఏ) బి.గోపాల రావు పశువులకు వైద్య సేవలందిస్తున్నారు. ఈయనే వంగరకు కూడా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. రెండు పశు వైద్య కేంద్రాలకు ఒకే ఒక్క ఉద్యోగి ఉండడంతో పశువైద్యసేవలు పూర్తిస్థాయిలో అందడం లేదు.

పట్టించుకోని జిల్లా యంత్రాంగం

మండలంలో పశువైద్య సేవలపై జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం చేస్తోంది. రెండున్నరేళ్లుగా ఈ రెండు ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది లేకపోయినా అధికారులు పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని పాడిరైతులు మండిపడుతున్నారు.మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లోని 37 గ్రామాల్లో ఆవులు, ఎద్దులు, గేదెలు, మేకలు, గొర్రెలు 33 వేల వరకు ఉన్నాయి. పశువైద్యశాలల్లో వైద్యులు, సిబ్బంది కొరత వల్ల వీటికి వైద్యసేవలందడం లేదు. మందులు కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచడం లేదు.మండలంలో 19 రైతు సేవా కేంద్రాలు ఉంటే.. ఎనిమిది మంది వెటర్నరీ అసిస్టెంట్లు మాత్రమే ఉన్నారు. రైతు సేవా కేంద్రాల్లో తూతూ మంత్రంగా సేవలందిస్తున్నారు. ఈకేంద్రాల్లో అరకొరగా మందులు ఉండడంతో సిబ్బంది సేవలందించలేకపోతున్నారు. పాడి రైతులు గత్యంతరం లేక ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోందని, వైద్యానికి,మందులకు వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని పాడి రైతులు వాపోతున్నారు.

పట్టించుకోవడం లేదు



మండలంలో పాడి రైతుల ఇబ్బందులను అధికారులు పట్టించుకోవడం లేదు. పశువులు వ్యాధి బారిన పడితే చికిత్స చేయించేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. వంగర పశువైద్య కేంద్రానికి వస్తే ఎప్పుడూ వైద్యుడు అందుబాటులో ఉండడం లేదు. మా సమస్యను పరిష్కరించుకునే నాథుడే లేకుండా పోయారు.
– బొద్రోతు శ్రీను, పాడి రైతు, సంగాం గ్రామం

పశువైద్యాధికారులను నియమించాలి



మండలంలోని రెండు పశువైద్యశాలలకు వైద్యాధికారులతో పాటు సిబ్బందిని నియమించాలి. రెండున్నరేళ్లుగా వైద్యులు, పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడం వల్ల పశువులు, మూగజీవాలకు వైద్యం సకాలంలో అందడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి. – గొంగాడ రమణ, వంగర.

ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకువెళతాం

వంగర మండలంలో పశువైద్యాధికారులు లేరన్న మాట వాస్తవమే. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం. వైద్యాధికారులు, సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటాం.
– ఎస్.దామోదరరావు, పశుసంవర్ధక శాఖ జేడీ, విజయనగరం

కొండచిలువ హతం

వంగర: పటువర్ధనం గ్రామంలో భారీ కొండచిలువను గ్రామస్తులు ఆదివారం హతం చేశారు. గ్రామానికి చెందిన యాండ్రాపు రాము ఇంట్లోకి కొండ చిలువ చొరబడడంతో గమనించినకు టుంబీకులు భయంతో బయటకు పరుగులు తీశారు. స్థానికులు అప్రమత్తమై 10 అడుగుల కొండచిలువను హతమార్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కూటమి ప్రభుత్వం అన్నింటా విఫలం


విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రేగిడి: టీడీపీ కూటమి ప్రభుత్వం అన్నింటా విఫలమైందని రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు, నియోజకవర్గ మేధావుల వర్గం అధ్యక్షుడు కెల్ల మన్మథరావు అన్నారు. మండలంలోని కందిశ గ్రామంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు యూరియా పంపిణీ చేయడంలో, పంటలకు మద్దతు ధర కల్పించడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. రైతులు ఒక బస్తా యూరియా కోసం పడరాని పాట్లు పడుతుండడం కొద్దిరోజులుగా చూస్తున్నామని అన్నారు. ఎరువుల కోసం గతంలో రైతులు ఎప్పుడూ ఇలా రోజూ రోడ్డెక్కాల్సిన అవసరం రాలేదని, కూటమి ప్రభుత్వం చేతకాని తనవల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటకు సకాలంలో ఎరువు వేయలేకపోతే ఆ ప్రభావం దిగుబడిపై ఉంటుందన్నారు. తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు పంటలకు యూరియా వేస్తే క్యాన్సర్ వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెబుతుండడం హాస్యాస్పదమన్నారు. యూరియా సమస్యతో పాటు నియోజవర్గ రైతులను సాగునీటి సమస్య కూడా వేధిస్తోందని చెప్పారు. తోటపల్లి సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. తాము అధికారంలోకి వస్తే గుంతలు లేని రోడ్లను చూస్తారని ఎన్నికల సమయంలో కూటమి నేతలు చెప్పారని, గ్రామీణ ప్రాంత రోడ్లు గోతులతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయని, ఎక్కడా తట్టెడు మట్టి వేసిన పాపాన పోలేదని ఆరోపించారు.రేగిడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నెల్లి పెంటన్నాయుడు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కింజరాపు సురేష్ పాల్గొన్నారు.

పనిగంటల పెంపుతో శ్రమ దోపిడీ



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

బొబ్బిలిరూరల్: పరిశ్రమల్లో,దుకాణాల్లో కార్మికులు 13 గంటలపాటు పనిచేయాలన్న బిల్లును ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు వ్యతిరే కించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు పి.శంకర రావు కోరారు. బూర్జివలసలో గ్రోత్ సెంటర్ కార్మికులతో కలిసి13 గంటల పని విధానానికి వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాసేలా ఇదివరకే కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్‌లను తెచ్చిందని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం 13 గంటల పనివిధానాన్ని ప్రవేశపెడుతోందని, ఇది దుర్మార్గపు చర్య అని విమర్శిం చారు. ఈనెల 19న కూటమి ప్రభుత్వం శాసన సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టిందని, 22న శాసన మండలికి వెళుతున్న నేపథ్యం లో ఇతర రాజకీయపార్టీలు దీన్ని వ్యతిరేకించాలని అభ్యర్థించారు. కార్మికుల శ్రమను కార్పొరేట్ యాజమాన్యాలకు దోచిపెట్టేందుకు చంద్ర బాబు కుటిల ప్రయత్నం చేస్తున్నారని, మానవత్వం కలిగిన ఎమ్మెల్యేలంతా దీన్ని వ్యతిరేకించాలని కోరారు. జిల్లా రైతు సంఘం నాయకులు గోపాలం ,కె.శంకరరావు, జి.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు


రామభద్రపురం: రొంపల్లి రైతు సేవా కేంద్రం వద్ద యూరియా పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్ అజు రఫీ జాన్


బాడంగిరామలక్ష్మి రైతుడిపోలో యూరియా పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్ వరప్రసాద్,ఏఓ సూర్యప్రకాష్

రామభద్రపురం: ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అజు రఫీ జాన్ అన్నారు. మండలంలోని రొంపల్లి రైతు సేవా కేంద్రం వద్ద ఆదివారం చేపట్టిన యూరియా పంపిణీని ఏఓ ఎం.శివతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులందరికీ యూరియా అందేలా చర్యలు తీసుకుంటామని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.రైతులు కూడా మోతాదుకు మించి యూరియా వాడొద్దని సూచించారు.

బాడంగి: స్థానిక రామలక్ష్మి రైతుడిపోలో యూరియా పంపిణీని ఏఓ సూర్యప్రకాష్, తహసీల్దార్ కె.వరప్రసాద్ పరిశీలించారు. అధికారులు మాట్లాడుతూ శనివారం 86 బస్తాలు పంపిణీ చేయగా, ఆదివారం 90 మంది రైతులకు యూరియా అందజేశామని చెప్పారు.

అమ్మ పూజకు వేళాయె..

- నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు


బొబ్బిలి: బొబ్బిలిలో బైపాస్ రోడ్డులోని దాడితల్లి అమ్మవారు


బొబ్బిలి: బొబ్బిలిలో మంటపంలో ప్రతిష్ఠించేందుకు సిద్ధం చేసిన అమ్మవారి విగ్రహం


బాడంగి: బాడంగిలోని ఉమాసోమేశ్వర ఆలయం

బొబ్బిలి: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వత్రా ఏర్పాట్లు పూర్తయ్యాయి.అన్ని ప్రాంతాల్లో ఉత్సవాల కోసం యువత మంటపాలను సిద్ధం చేసింది. మంటపాల్లో ప్రతిష్ఠించేందుకు అమ్మవారి విగ్రహాలను మంటపాలకు తరలించారు.పట్టణంలోని గొల్లపల్లి దాడితల్లి అమ్మవారు, కృష్ణాపురంలోని దుర్గాదేవి ఆలయాల్లో సోమవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. బైపాస్ రోడ్డులోని దాడితల్లి ఆలయంలో ఏటా అమ్మవారికి 108 లీటర్ల పాలతో అభిషేకాలు, 108 రకాల ప్రసాదాలు సమర్పించే సంప్రదాయం ఉంది. ఈఏడాది కూడా ఈ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు దాడితల్లి ఆలయ పురోహితులు పిండిప్రోలు మణికుమార్ శర్మ తెలిపారు.

ఉమాసోమేశ్వర ఆలయంలో...

బాడంగి: స్థానిక ఉమాసోమేశ్వరాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను సోమవారం నుంచి నిర్వహించనున్నామని ఆలయ ప్రధానఅర్చకులు రేజేటి సాయిచైతన్య ఆదివారం తెలిపారు. తొలిరోజున ఉమాదేవి బాలత్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నట్లు చెప్పారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని అమ్మవారు రోజుకో అవతారంలో దర్శనమివ్వనున్నారని పేర్కొన్నారు.

వంగర మండలంలో..

వంగర: మండలంలోని రుషింగి, ఎం.సీతారాంపురం, గీతనాపల్లి, పటువర్ధనం తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలను ఆలయ కమిటీ సభ్యులు శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు చేశారు.ఆలయాల్లో తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు, కుంకుమార్చన చేపట్టనున్నామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశామని ఆలయాల కమిటీ సభ్యులు చెప్పారు.

• విద్యార్థుల విజ్ఞాన, వినోద యాత్ర


సీతంపేటలోని ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో విద్యార్థులు

సంతకవిటి: మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆదివారం విజ్ఞాన, వినోద యాత్ర చేశారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు బి.శ్రీనివాసం, పి.రమణమూర్తి ఆధ్వర్యంలో సీతంపేటలోని గిరిజన గ్రామాలను సందర్శించారు. అలాగే ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్, కన్నెదార కొండ, మెట్టుగూడ జలపాతంతో పాటు టీటీడీ ఆధ్వర్యంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించారు. గిరిజనుల సంస్కృతీ సంప్రదాయాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు.

తెలుగు వెలుగు.. గురుజాడ


బొబ్బిలి: గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జె.సి.రాజు, తదితరులు


తెర్లాం: గ్రంథాలయంలో గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి, విద్యార్థులు


బొబ్బిలిరూరల్: గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు


రాజాం సిటీ: వెలుగు రామినాయుడును సత్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక సభ్యులు

బొబ్బిలి: మహాకవి గురజాడ వెంకట అప్పారావు తెలుగు భాషకు వెలుగు జాడ అనడంలో ఎంతో గౌరవం ఇమిడి ఉందని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జె.సి.రాజు అన్నారు. పట్టణంలోని ఆ సంస్థ కార్యాలయంలో గురజాడ అప్పారావు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గురుజాడ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జె.సి.రాజు మాట్లాడుతూ తన రచనల ద్వారా సామాజిక దురాచారాలను ఎండగట్టి సమాజంలో మార్పునకు, ప్రజల్లో చైతన్యవంతానికి గురజాడ ఎంతో పాటు పడ్డారన్నారు. ఏనాడో ఆయన రచించిన కన్యాశుల్కం నాటకం నేటికీ ప్రదర్శితమవుతుండడం ఆయన రచనా పటిమను తెలియజేస్తుందన్నారు. సభ్యులు ఆర్.ఎన్.రాజు, చిన్నారావు, రామకృష్ణ, రాంబాబు,చందు, కృష్ణమోహన్, శివకాంత్,జయప్రకాష్, చంద్రకిశోర్,తదితరులు పాల్గొన్నారు.

జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో..

రాజాం సిటీ: తెలుగుసాహిత్యానికి అడుగుజాడ గురజాడ అని సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ అన్నారు. స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో జనవిజ్ఞానవేదిక(జేవీవీ)ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతిని ఆదివారం నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి నిర్వాహకులు, అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా దివాకర్ మాట్లాడుతూ తన రచనల ద్వారా సాంఘిక పరివర్తన తీసుకువచ్చిన గొప్ప కవి అని కొనియాడారు. ఆయన రచనలు ఈ నాటికీ ప్రజల మన్ననలు పొందుతున్నాయని పేర్కొన్నారు. గురజాడ రచించిన కన్యాశుల్కం నాటకానికి సాహితీలోకంలో ఓ ప్రత్యేక స్థానం ఉందని, తెలుగు సాహిత్యంలో వాడుక భాషలో వరవడికి కృషిచేసి, సామాజిక సంస్కరణల్లో బాటలువేసిన ఆయన అడుగుజాడల్లో మనందరం నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. రాజాం గురజాడగా పేరుగాంచిన వెలుగు రామునాయుడును సత్కరించారు. జేవీవీ డివిజన్ కార్యదర్శి గొర్లె రమేష్, రెడ్‌క్రాస్ అధ్యక్షులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, రోటరీక్లబ్ అధ్యక్షులు గట్టి పాపారావు, జేవీవీ గౌరవాధ్యక్షులు శాసపు సత్యనారాయణ, జరజాన నీలయ్య, మక్క అప్పలనాయుడు, పెంకి గౌరీశ్వరరావు, పెంకి చైతన్య, రారవే అధ్యక్షుడు గార రంగనాథం, యూటీఎఫ్ నాయకులు రెడ్డి మోహనరావు, పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్.వి.జె. నాయుడు, డోల అప్పలనాయుడు, సాహితీవేత్తలు పిల్లా తిరుపతిరావు, ఒమ్మి రమణమూర్తి, రౌతు గణపతిరావునాయుడు, బి.బుద్ధుడు, నీలకంఠేశ్వరయాదవ్ పాల్గొన్నారు.

ఎమ్మార్సీలో..

బొబ్బిలిరూరల్: స్థానిక ఎమ్మార్సీలో గురజాడ అప్పారావు జయంతిని ఆదివారం నిర్వహించారు. జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షులు వేణుగోపాల్, యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు విజయగౌరి, నాయకులు కృష్ణదాస్, ప్రసన్నకుమార్,మహేష్,స్వామినాయుడు, తదితరులు గురుజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తెర్లాంలో..

తెర్లాం: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో గురజాడ అప్పారావు జయంతిని లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.గురజాడ చిత్రపటానికి లైబ్రేరియన్, పాఠకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చెరువును తలపిస్తున్న రోడ్డు

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట–ఖండ్యాం గ్రామ రహదారి అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డులో ఎక్కడికక్కడ గోతులు తేలడంతో ఏమాత్రం వర్షం కురిసినా సరే వర్షం నీరుగోతుల్లో నిలిచిపోయి చెరువులా తయారవుతోంది. గోతులు నీటితో నిండి ఉండడం వల్ల ద్విచక్రవాహన చోదకులు వాటిని అంచనా వేయలేక అదుపుతప్పి పడిపోతున్నారు. ఇసుక లారీలు, ట్రాక్టర్లు ఈ రహదారిలో వెళుతుండడంతో గోతులు రోజురోజుకూ పెద్దవిగా మారిపోతున్నాయి. ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆ రోడ్డు పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


ఉప్పర్నాయుడువలస వద్ద రోడ్డుపై ఏర్పడిన గోతిలో నిలిచిన వర్షపు నీరు